Andhra Jyothi Dt. 28/12/13.



## 2013 రౌండప్...

నగరవాసులను ట్రాఫిక్ నుంచి గట్టెక్కించడానికి 2012లో ప్రారంభమైన మెట్రోరైలు ప్రాజెక్టు పనులు 2013లో శరవేగంగా దూసుకుపోతున్నాయి. 2015 ఉగాది నాటికి తొలిదశ ప్రాజెక్టును పూర్తి చేయాలన్న లక్ష్యంతో హెచ్ఎంఆర్, ఎల్అండ్‌టీ శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. 2700 పిల్లర్లు వేయాల్సి ఉండగా 1100 పిల్లర్లను ఇప్పటికే పూర్తి చేశారు. నాగోలు-మెట్టుగూడ ప్రాంతంలో వయడక్ట్ మీద రైలు పట్టాలను అమర్చే పని నవంబర్ నుంచి మొదలు పెట్టారు... ● నగరంలో 2011 నుంచి అమలవుతున్న డ్రంక్ అండ్ డ్రైవింగ్‌లో కేసుల నమోదు సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది.. జరిమానా రూపంలో కాసుల వర్షం కురుస్తున్నప్పటికి వాహనదారుల్లో మార్పు రానంత వరకు తామేమీ చేయలమని ట్రాఫిక్ పోలీసులు అంటున్నారు. మందుబాబులను నియంత్రించడానికి ప్రస్తుతం ఉన్న రూ.రెండు వేల జరిమానాను రూ.2,600కి పెంచారు. మత్తులో డ్రైవింగ్ చేస్తున్న వారి సరసన మహిళలు కూడా పెరుగుతున్నారు. 2011లో వారి సంఖ్య ఒకరు కాగా 2013 నాటికి ఆ సంఖ్య ఇప్పటి వరకు 11కు చేరింది.

# 'మెట్రో రైలు' చకచకా..!

### పిల్లర్ల నిర్మాణం వేగవంతం

### హెచ్ఎంఆర్-ఎల్అండ్‌టీ సమన్వయం

### 2015 ఉగాది నాటికి తొలిదశ పూర్తి!

ఆంధ్రజ్యోతి, హైదరాబాద్ సిటీ : అడుగు తీసి అడుగేయాలంటే అరగంట. ఒక చోటు నుంచి మరో చోటుకు వెళ్లాలంటే గంటల తరబడి ప్రయాణం.. రోడ్డుపై వెళ్తుంటే పొగ, దుమ్ము, కాలుష్యం. వాటిన్నింటి నుంచి నగరవాసులకు విముక్తి కల్పించడానికి ఈ ఏడాది ప్రారంభమైన కానుకే.. హైదరాబాద్ మెట్రో రైలు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య ప్రాజెక్టు మెట్రోరైలు.. తొలిదశలో ఉప్పల్ నుంచి మెట్టుగూడ మార్గంలో 2015 ఉగాది నాటికి ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని అధికారులు అంటున్నారు. నాగోల్ నుంచి మెట్టుగూడ మార్గంలో 8 కిలోమీటర్ల పొడవున మెట్రో వయడక్ట్ మీద పట్టాలు వేసే పని నవంబర్‌లో మొదలైంది. రూ.16,735 కోట్లతో చేపడుతున్న ప్రాజెక్టు కోసం దాదాపు 204 ఎకరాల భూమి అవసరం. ఇప్పటికే చాలా భాగాన్ని సేకరించారు. ఉప్పల్-మెట్టుగూడ మార్గంలో రైలు నడవడానికి 15 నెలల కాలం మాత్రమే ఉండడంతో 2013 చాలా కీలకంగా మారింది. ప్రాజెక్టులో ఇప్పటికి నాలుగోవంతు పూర్తయిందని మెట్రోరైల్ ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి చెబుతున్నారు. 2012 మేలో ప్రారంభమై.. ఇప్పటి వరకు బాగానే పనిచేయగలిగామంటున్నారు. "వర్షాకాలం మొదలయ్యేలోగా అన్ని పిల్లర్లకు పునాదులు వేసేయాలన్నదే మా లక్ష్యం. ఒక్క రెండో కారిడార్ తప్ప మియాపూర్-ఎల్‌బీ నగర్, నాగోల్-శిల్పారామం మార్గాలను పూర్తిచేయాలని నిర్ణయించాం" అని ఆయన స్పష్టం చేశారు.



ఉప్పల్ డిపో వద్ద రైలు పనులు (పాత చిత్రం)



### మెట్రో రైలు ప్రాజెక్టు కమామిషు..

మెట్రోరైలు మార్గంలో 2700 పిల్లర్లున్నాయి. వాటిలో 1100కు పునాదులు పూర్తయ్యాయి. మరో 1600కు వేయాలి. ఒక్కో పిల్లర్ పూర్తిచేయడానికి కనీసం మూడు వారాల సమయం పడుతుంది. ఈ పని ఆగుతూ.. సాగుతూ నడుస్తోంది. మెట్రోరైలు వర్గాలు పెట్టుకున్న లక్ష్యాలు, వాటి పురోగతి..

★ డిజైనింగ్ పనులు 2013లో మొదలై ఇప్పటికి 25 శాతం పూర్తయింది.
★ ఉప్పల్ డిపో పనులు 86 శాతం పూర్తయ్యాయి, రెండు నెలల్లో ముగుస్తాయి.
★ మియాపూర్ డిపోలో 68 శాతం పనులు పూర్తయ్యాయి.
★ 2,700 పిల్లర్లు వేయాల్సి ఉండగా 1100కు పునాదులు పూర్తయ్యాయి.
★ 950 పిల్లర్లు పూర్తిగా లేచాయి.
★ 10 కిలోమీటర్ల మేర వయడక్టులు వేసే పని పూర్తయింది.
★ కొన్ని చోట్ల మినహా ఉప్పల్-మెట్టుగూడ మార్గం మొత్తం పూర్తయింది.
★ వయడక్టుల మీద రైలుపట్టాలు పరిచేపని డిసెంబర్ 31 నాటికి ఒక కిలోమీటరు పూర్తవుతుంది.
ఎన్‌జీఆర్ఐ నుంచి సర్వే ఆఫ్ ఇండియా వరకు పట్టాల పని పూర్తయింది.
★ ఇప్పటివరకు ఎల్అండ్‌టీ రూ. 3,100 కోట్లు, హెచ్ఎంఆర్ రూ. 900 కోట్లు ఖర్చు చేశాయి.

